నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, గురువారం 24 అక్టోబర్ 2024 | VIKARABAD

మాకు 60 ఎకరాలు.. 80 మంది కుటుంబ సభ్యులు..

మాది ఉమ్మడి కుటుంబం. మాకు మొత్తంగా 60 ఎకరాల భూమి ఉన్నది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో సాగు చేసుకొని వరి, వేరుశనగ, పత్తి, జొన్న వంటి పంటలను పండించుకుంటున్నాం. మావి మాగాణి భూములు. ఆశించినంత మేరకు పంట చేతికి వస్తుంది. ఫార్మా కంపెనీ పేరుతో మొత్తంగా భూమిని లాక్కోవడానికి సీఎం చూస్తుండు. భూమి పోతే రోడ్డుపై పడాల్సిన పరిస్థితి. రూ.10లక్షలు మొఖాన కొట్టి భూమిని అప్పనంగా అందుకుపోయే ప్రయత్నం చేస్తుండ్రు. ఫార్మా ఏర్పాటుకు ఈ ప్రాంత రైతులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. కంపెనీలు వస్తే ఈ ప్రాంతం పూర్తిగా నాశనం అవుతుంది. మానవ మనుగడకు పూర్తి ముప్పు ఏర్పడుతుంది. కాలుష్యంతో కొడంగల్ మొత్తం విషపూరితం అవుతుంది. రేవంత్‌రెడ్డిని ఎన్నుకున్న పుణ్యమా.. అని మాకు ఆయన ఈ గతి పట్టిస్తుండు. చూస్తూ మా ప్రాంతాన్ని కలుషితం చేసుకోలేం.

– నార్ల హన్మంతు

ఫార్మా ఏర్పాటుతో కాలుష్యాన్ని అంటగట్టేందుకు ప్రభుత్వ యత్నం

అసైన్డ్ భూములపై అడ్డగోలు పట్టాలు

ఫార్మాను సమర్థిస్తున్నవారంతా నకిలీ రైతులే..

సుదీర్ఘ పోరాటాన్ని కొనసాగిస్తున్నా స్పందించని ప్రభుత్వం

హకీంపేట ప్రాంతంలో పచ్చని పంట పొలాలు

నీళ్లు పారిస్తామని.. కన్నీళ్లు పెట్టిస్తారా..?

పచ్చని పంట పొలాలను కబళించేందుకు ఫార్మా కంపెనీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని దుద్యాల మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏండ్లుగా పంటలను పండించుకుంటున్న తమ భూములను లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. సెంటు భూమి కూడా కొనలేని స్థితిలో ఉన్న తమను అగాథంలోకి నెడుతున్నారని వాపోతున్నారు. ఫార్మా వద్దని వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం ఇసుమంత కూడా పట్టించుకోవడంలేదన్నారు. డ్రోన్‌లతో సర్వేలు చేయిస్తున్నదని మండిపడుతున్నారు. ఉన్న భూమిని తాము వదులుకుంటే భార్యాబిడ్డలతో ఎక్కడకు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఏ పని చేసుకొని బతకాలో అర్థం కావడం లేదంటున్నారు. ప్రస్తుతం ఫార్మా ఉన్న ప్రాంతాల్లో కాలుష్యం విలయ తాండవం చేస్తున్నదన్నారు. ఇక్కడి పంట పొలాలకు కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలతో నీళ్లు తెచ్చి సస్యశ్యామలం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి.. ఇప్పుడు అన్నదాతల కడుపుకొట్టే చర్యలకు ప్రభుత్వం పూనుకోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల మాదిరిగా భూములను కాపాడుకుంటూ వస్తున్నామని, నేడు అప్పనంగా భూములను కాజేసేందుకు ప్రయత్నం చేస్తున్నదన్నారు. భూములు వదులుకోవాల్సిన పరిస్థితి వస్తే గల్లీ నుంచి ఢిల్లీ వరకు వెళ్లేందుకు సిద్ధమని రైతులు హెచ్చరిస్తున్నారు.

– కొడంగల్, అక్టోబర్ 23

కొంపలు ముంచుతున్న అసైన్డ్ ల్యాండ్

దుద్యాల మండలం పోలెపల్లి, హకీంపేట, లగచర్ల ప్రాంతాల్లో అసైన్డ్ ల్యాండ్ కేవలం 252 ఎకరాలున్నదని, కానీ కొందరు దొంగదారుల్లో పట్టాలు సృష్టించుకోగా ప్రస్తుతం 500 ఎకరాలకు పైగా అసైన్డ్ ల్యాండ్ ఉన్నట్లుగా ఆరోపణలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. అధికారులను ఒప్పించుకొని ఎవరికిష్టం వచ్చినట్లు వారు పట్టాలను సృష్టించుకున్నారని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు. కబ్జాలో ఉన్న రైతులకు పట్టాలు లేవు కానీ కబ్జాలో లేని రైతులెందరికో ఈ ప్రాంతంలో భూములున్నాయన్నారు. ఫార్మాకు భూములిస్తున్నామని ముందుకు వచ్చేది ఈ నకిలీ రైతులేనని. అసలైన రైతులెవరు కూడా ఫార్మా కంపెనీలకు భూములిచ్చేందుకు సిద్ధంగా లేరని వెల్లడిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మొదటగా అసైన్డ్ ల్యాండ్ ఎంత ఉన్నది, ఏవిధంగా రైతుల సంఖ్య పెరిగిందనే వాస్తవాలు బట్టబయలవుతాయని బాధిత రైతులు తెగేసి చెబుతున్నారు.

హకీంపేట గ్రామం

ప్రభుత్వాన్ని తప్పదోవ పట్టిస్తున్నారు..

'ఈ ప్రాంతంలో కనుచూపు మేర పట్టా ల్యాండ్‌లు ఉన్నాయి.. కొంతవరకు మాత్రమే అసైన్డ్ ల్యాండ్ ఉండి పట్టా భూములకు ఆనుకొని ఉండడంతో పట్టా భూములను ఫార్మా భూతం మింగే ప్రయత్నం కొనసాగుతున్నది..' అని బాధిత రైతులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అక్కడక్కడ కొంతమేర మాత్రమే గుట్ట ప్రాంతంగా ఉన్నదని, అయినప్పటికీ ఆ గుట్ట చుట్టూ పచ్చటి పొలాలే దర్శనమిస్తాయని అంటున్నారు. చెట్లను చూసి అధికారులు గుట్టలు అనుకొని ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పచ్చటి పొలాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయడం భావ్యం కాదన్నారు. ఇప్పుడిప్పుడే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటుంటే ఫార్మా భూతంతో కంటికి నిద్రలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మాకు భూములనిచ్చే ప్రసక్తి లేదని, ప్రజా ప్రయోజనాలకు పనికివచ్చే కంపెనీల ఏర్పాటుకు స్వచ్ఛందంగా భూములు అప్పగించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంటున్నారు.

అన్నదాతలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

ప్రస్తుతం ఈ ప్రాంతంలో భూములు ఎకరాకు దాదాపు తొంభై లక్షల నుంచి కోటి విలువ పలుకుతున్నదని రైతులు చెబుతున్నారు. కాని ప్రభుత్వం కేవలం రూ.10లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నదన్నారు. దీంతో భూములను వదులుకోవడానికి రైతులు సిద్ధంగా లేరన్నారు. అయితే ప్రభుత్వం అన్నదాతలను మభ్యపెట్టి స్వచ్ఛందంగా భూములు అందిస్తే రూ.10లక్షలతో పాటు 125 గజాల ఇంటి స్థలం, ఇంటికో ఉద్యోగం అని ఆశపెడుతున్నదని ఆరోపిస్తున్నారు. గ్రామాలవారీగా ఫార్మా బాధిత రైతులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాల సేకరణ చేపడుతుండడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

మొదటికే మోసం

హకీంపేట గ్రామంలో సుమారు 1600లకు పైగా జనాభాతోపాటు దాదాపు 1300 ఎకరాల సాగుభూములున్నాయి. ఈ ప్రాంతంలో కంది, వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి, పెసర, వేరుశనగ, మామిడి, బత్తాయి, ఎర్రచందనం వంటి పంటలను పుష్కలంగా పండించుకుంటున్నారు. సాధారణంగా అధిక మొత్తంలో వరి పంట సాగు ఉందని, బోర్ల ద్వారా పంటలను పండించుకొని ఆర్థికంగా లాభపడుతున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయితే కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో ఓ వెలుగు వెలుగుతుందని అనుకుంటే, మొదటికే మోసం వచ్చేలా అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసైన్డ్ భూమి 252 ఎకరాలు.. పట్టాలు 500లకు పైగా..

హకీంపేట పరిధిలో అసైన్డ్ భూమి ఉన్నది 252 ఎకరాలు మాత్రమే కానీ పట్టాలు పొందిన ప్రకారం 500ల ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నకిలీ పట్టాదారులే అసలైన రైతుల కొంపలు ముంచుతున్నారు. కబ్జాలో ఉన్నవారికి పట్టాలు లేవు కానీ మిగతావారికి ఇష్టానుసారంగా అధికారులు పట్టాలు రాసి ఇచ్చారు. అధికారులు దీన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ విషయమై ఢిల్లీ వరకు కూడా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. లేని అసైన్డ్ భూమిని చూసే ప్రభుత్వం ఇక్కడ ఫార్మా కంపెనీ ఏర్పాటుకు పూనుకున్నది. అసైన్డ్ భూమిపై పూర్తి విచారణ చేపడితే, నిజనిజాలు తేలుతాయి.

– కుమ్మరి శివకుమార్, ఫార్మా బాధిత రైతు, హకీంపేట, దుద్యాల మండలం

రైతులు చెప్పింది.. అధికారులు వినడంలేదు..

ఫార్మా కంపెనీ వద్దని రైతులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం చెప్పిందే వినాలంటున్నారు. మాకున్న మూడు ఎకరాల పొలం ఫార్మాకు పోతే, మా బతుకు ఏ విధంగా కొనసాగించాలి. వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాం. మా నాన్న ఆర్మీలో ఉండి దేశానికి రక్షణగా ఉన్నారు. కానీ మా భూమిని మేము కాపాడుకోలేకపోతున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి ఒంటెద్దు పోకడ మానుకోవాలి. రైతు సంక్షేమాన్ని గుర్తించాలి.

– ప్రవీణ్‌కుమార్

ఒప్పుకొంటే పది లక్షలు.. లేకుంటే రూ.6లక్షలు

ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సమ్మతించి భూమిని అందిస్తే రూ.10లక్షలు ఇస్తారంట. లేదంటే రూ.6లక్షలు ఇచ్చి లాక్కొంటారంట. రూ.90లక్షల వరకు ధర పలుకుతున్న భూములను ప్రభుత్వం అప్పనంగా రూ.10లక్షలకు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నది. ఉద్యోగం, ఇంటి స్థలం ఇస్తామని ఆశ చూపుతుండ్రు. ఫార్మా కంపెనీ ఏర్పాటు కావడానికి చాలా సమయం పడుతుందని ప్రశ్నిస్తే.. మీకెందుకు మీరు భూమి ఇచ్చిన నాటి నుంచే మీకు ఉద్యోగం వచ్చి వేతనం అందుకుంటారని అధికారులు మాయమాటలు చెబుతుండ్రు. ఏర్పాటు కాని కంపెనీల్లో ఉద్యోగాలు ఏంటో.. వేతనం ఇవ్వడం ఏంటో.. అంతా అయోమయంగా ఉన్నది.

– దోరెమోని శివకుమార్

ఎంతకైనా తెగిస్తాం..

మా ఎనిమిది మంది అన్నదమ్ముళ్లకు 32 ఎకరాలు ఉన్నది. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూమిని లాక్కోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తుండు. సీఎం అవుతాడని ఎమ్మెల్యేగా గెలిపించుకున్న పాపానికి మాకు ఈ దురదృష్టం పట్టింది. ప్రభుత్వమే ప్రజలను కాటేసేందుకు ప్రయత్నిస్తే మేం ఎవరికి చెప్పుకోవాలి. ఫార్మాకు మా భూములు ఇచ్చేది లేదు. ఎంతకైనా తెగిస్తాం. సమస్య పరిష్కరిస్తే సరి.. లేకపోతే చట్టపరంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తాం.

– దోరెమోని గోపాల్

డ్రోన్లతో సర్వేలు..

రైతులు భూములను అప్పగించకుండానే ప్రభుత్వం రైతు భూముల్లో డ్రోన్లతో సర్వేలు చేపడుతున్నది. డ్రోన్లను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. అడ్డదారుల్లో భూములను లాక్కొనే యత్నం జరుగుతున్నది. పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేకుండా పోతున్నది. ఊహ తెలిసిన నాటి నుంచి భూమిపైనే ఆధారపడి, పంట సాగుతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఎవరినీ దూషించడంలేదు. అభివృద్ధిని అడ్డుకోవడంలేదు. మా రైతుల జోలికి రావద్దని మాత్రమే వేడుకుంటున్నాం. ప్రజా ప్రయోజనాలకు పనికి వచ్చే ఫ్యాక్టరీ, కంపెనీలను ఏర్పాటు చేస్తే స్వాగతిస్తాం.

– బాలకిష్టయ్య

అరచేతిలో ఆరు గుడ్లు!

'చిన్న'బోయిన పోషకాహార పంపిణీ లక్ష్యం

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 23 : కోడి గుడ్డు చిన్నబోయింది. బాలింతలు, పసికందులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న కోడి గుడ్లు చిన్న సైజులో దర్శనమిస్తున్నాయి. అరచేతిలో ఆరు గుడ్లు పడుతున్నాయంటే వాటి సైజు ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. తల్లిదండ్రులు ఈ చిన్న సైజు గుడ్లు ఏమిటని సిబ్బందిని అడిగితే కాంట్రాక్టర్ అలాగే వేశారని చెబుతున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 77 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలు కలిపి 41 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. గ్రామ పంచాయతీల్లో 36 కేంద్రాలు ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఒక్కో అంగన్‌వాడీ సెంటర్‌కు సగటున 400 నుంచి 1200కు పైగా గుడ్లు వస్తున్నాయి. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పెద్దఅంబర్‌పేట, కుంట్లూరు, పసుమాముల, తట్టిఅన్నారం, ఆర్కేనగర్, మర్రిపల్లి తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న కోడి గుడ్లు చిన్నసైజులో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడప్పుడు గుడ్ల సైజు చిన్నగా ఉంటున్నాయని, ఈసారి మరీ దారుణంగా అరచేతిలో ఐదారుకు పైగా గుడ్లు పట్టే పరిస్థితి ఉన్నదని చెబుతున్నారు. తప్పని పరిస్థితుల్లో తీసుకెళ్తున్నామంటున్నారు. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ మాట్లాడుతూ చిన్నగుడ్లు వస్తే కాంట్రాక్టర్‌కు తిరిగి అప్పగిస్తామని, నాణ్యమైన గుడ్లనే లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. ఈ విషయంపై అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతామన్నారు. లబ్ధిదారులు ఇప్పటికే గుడ్లు తీసుకెళ్తే.. అంగన్‌వాడీ కేంద్రాల్లో తిరిగి ఇచ్చేలా చూస్తామన్నారు. నాణ్యమైన, మంచి సైజులో ఉన్న గుడ్లను అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పొద్దెక్కినా వీడని పొగమంచు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను బుధవారం మంచు కమ్మేసింది. పొద్దున్నే పొలం పనికి వెళ్లే వారు తొవ్వ కనిపించక ఇబ్బందులు పడ్డారు. రోడ్ల వెంట వాహనాలు లైట్లు వేసుకున్నా సరిగా కనిపించకపోవడంతో పొద్దెక్కే వరకు పక్కకు నిలుపుకోవాల్సి వచ్చింది. పంట చేన్లు మంచుతో తడిసి ముద్దయ్యాయి. పొద్దంతా ఎండ తీవ్రత, అప్పడప్పుడు వాన, పొద్దుగూకితే చలి, తెల్లారితే మంచు కురుస్తున్నది.. మూడు కాలాలు ఒకేసారి ఈ మధ్య రోజుల్లో కనిపిస్తున్నాయని జనం పేర్కొంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముందు చలి తీవ్రత ఎలా ఉంటుందోనని జిల్లావాసులు ముచ్చటించుకుంటున్నారు.

శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో..

ఫీజు బకాయిలు చెల్లించండి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థి సంఘాల ధర్నాలు, ర్యాలీలు

పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

షాబాద్, అక్టోబర్ 23 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంతో గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులను వేధిస్తున్న పరిస్థితి నెలకొన్నదన్నారు.

వికారాబాద్ జిల్లాలో..

పరిగి, అక్టోబర్ 23 : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పరిగిలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఏబీవీపీ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులు కొడంగల్ చౌరస్తా నుంచి ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయి గణేశ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు సుమారు రూ.7800కోట్లు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా విద్యా శాఖకు మంత్రి లేడని, ముఖ్యమంత్రికి విద్యా రంగంపై ఎంత చిత్తశుద్ధి ఉన్నదో అర్థం చేసుకోవచ్చన్నారు. స్కాలర్‌షిప్‌లు రాని కారణంగా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వబోమంటున్నాయని, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కాంగ్రెస్‌కు రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బకాయిలు విడుదల చేయకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి గణేశ్, ప్రేమ్‌కుమార్, రఘు, ఇమ్రాన్, ధనరాజ్, శివ, ప్రవీణ్, మల్లేశ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు